క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



చోడసముద్రంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న యోగేశ్వరరావు

సారవకోట: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో శనివారం రాత్రి ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు గిరిజన పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చోడసముద్రం, సింగంవలస, బొంగాడిపేట తదితర గ్రామాల్లోని గిరిజన వృద్ధులకు అందజేశారు. శీతాకాలంలో వృద్ధులు చలి నుంచి రక్షించుకోడానికి మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో దుప్పట్లు అందజేస్తున్నట్లు తెలిపారు.

భగవద్గీత శ్లోకాల పారాయణం



భగవద్గీత శ్లోకాలు పారాయణం చేస్తున్న విద్యార్థులు

సారవకోట: మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పారాయణ కార్యక్రమం చేపట్టారు. చదడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ సాయమ్మ తెలిపారు.

మానవ హక్కులను వినియోగించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న అరుణ్ కుమార్, తదితరులు

ఆమదాలవలస: మానవ హక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గరికి అరుణ్‌కుమార్ అన్నారు. హెచ్ఆర్సీఐ, అరుణోదయ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆమదాలవలస పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులను సామాన్య, బడుగు, బలహీన, మైనార్టీ, గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్సీఐ సభ్యులు సంధ్యారాణి, అప్పలరాజు గౌతమ్, బి.సింహాచలం, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలతో ప్రయోజనం



పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం

హిరమండలం: పంట కోత ప్రయోగాలతో ఎంతో ప్రయోజనమని ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషనల్ డీపీఎం ధనుంజయరావు అన్నారు. కిట్టలపాడులో పంట కోత ప్రయోగాలపై హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, జలుమూరు, సారువకోట మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ధనుంజయరావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో సైతం పంట కోత ప్రయోగాలు చేపట్టి పంటలు పండించవచ్చని అవగాహన కల్పించారు. పంట కోసే ముందు.. తరువాత చేపట్టాల్సిన అంశాలను వివరించారు. ఎస్ఎఫ్ఏ గోవిందరెడ్డి, ముసలయ్య, ఎంటీఎస్ సూర్యనారాయణ, చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి చేదోడుతో రక్షణ



మాట్లాడుతున్న మండల కో ఆర్డినేటర్ రాజారావు

పాతపట్నం: తల్లిదండ్రులను విడిచి దూరంగా చదువుతున్న విద్యార్థులకు చిన్నారి చేదోడు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని మండల కో ఆర్డినేటర్ నల్లి రాజారావు అన్నారు. మండలంలోని కాగువాడ గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరుగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చిన్నారికి చేదోడు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థినులు తింటున్న అల్పాహారకాన్ని, పాఠశాల డార్మెటరీని, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా వెంటనే తెలియజేయాలన్నారు. చేడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీరాములు, కానిస్టేబుల్ జీవన్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి



పాతపట్నం: స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, డీఎస్పీ బాలచంద్రరెడ్డి

- సభా వేదికను పరిశీలించిన డీఎస్పీ, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: నియోజకవర్గం కేంద్రంలోని పాతపట్నంలో ఈ నెల 13న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. సభా స్థలాన్ని, ట్రాఫిక్ మళ్లింపుపై ఎమ్మెల్యే, టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆల్ ఆంధ్ర రోడ్డు కూడలి, నవతల కూడలి, కల్లాట కల్యాణ మండపాన్ని తనిఖీ చేశారు. వేదిక ఏర్పాట్లపై ఎమ్మెల్యేను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాతపట్నం, కొత్తూరు సీఐలు వినోద్ బాబు, వేణుగోపాల్‌తో కలిసి ట్రాఫిక్ మళ్లింపు, సభా వేదిక వద్దకు వివిపీల వాహనాల పార్కింగ్‌ల తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మిరిబెల్లి శ్యామ్‌సుందరారవు, ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, ఎస్ఐలు మహమ్మద్ యాసిన్, రాజేష్ పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తరలిరావాలి..

ఎల్.ఎన్.పేట: ఈ నెల 13వ తేదీన పాతపట్నంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు పిలుపునిచ్చారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు, పార్టీ నాయకులు ముగడ దివాకర్, లోచర్ల మల్లేశ్వరరావు, రెడ్డి సీతారాం, టి.శోభన్‌బాబు, ఎర్ర జనార్దన తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- బ్రాహ్మణుల వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: శాంతియుతంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీవేద గాయత్రి ఆమదాలవలస మండల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్తీక వన భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందన్నారు. బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్రాహ్మణ విద్యార్థులు, యువత, పురోహితులు, మహిళల సంక్షేమం కోసం కార్పొరేషన్ ద్వారా చిత్తశుద్ధితో సేవలు అందించటం జరుగుతుందన్నారు. శ్రీవేద గాయత్రి బ్రాహ్మణ సంఘానికి కమ్యూనిటీ హాల్ కోసం స్థలాన్ని ఇప్పటికే కేటాయించామని, త్వరలో హాల్ కూడా కట్టించి ఇస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తొలిత స్పీకర్‌ను వేదపండితులు ఆహ్వానించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు బలివాడ రాజేష్‌శర్మ, కర్రి రవిప్రసాద్, డాక్టర్ మల్లెల కృష్ణప్రసాద్, బులుసు పేరుశాస్త్రి, దూసి హయగ్రీవరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1971–76 విద్యా సంవత్సరంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో జరిగింది. విభిన్న వృత్తులలో స్థిరపడి విశ్రాంత జీవనం సాగిస్తున్న వీరు అర్ధ శతాబ్దం క్రితం నాటి జీవనస్థితి గతులు, ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ, తాము సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. గ్రూపు ఫొటోను తీసుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో లాలిశెట్టి గోవిందరావు, రౌతు అప్పన్న, డాక్టర్ మెండ ప్రవీణ్, చౌదరి రాధాకృష్ణ, బోయిన ఆనందంరావు, యాళ్ల రాజారావు, జుత్తు శిమ్మయ్య, జోగిమహంతి రాంబాబు, వరుదు విజయకుమార్, వరుదు నాగేశ్వరరావు, రొక్కం నారాయణరావు, రెడ్డి రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా తమ సహచరుడు యడ్ల అప్పన్న మృతికి సంతాపం తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

రణస్థలం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో (ఏటీఎం మోడల్) కూరగాయల పంటలు సాగు చేస్తే అధిక దిగుబడితోపాటు రాబడి లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ తెలిపారు. మండలంలోని పైడిపేట గ్రామంలో పైడి లక్ష్మి తన 15 సెంట్లలో ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఏటీఎం పద్ధతిలో చేస్తున్న కూరగాయల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. యూనిట్ ఇన్‌చార్జి కొయ్యాన రాంబాబు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

లావేరు: మండలంలోని మురపాక పంచాయతీలో పలు కుటుంబాలకు ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. వీటిని లబ్ధిదారులకు మురపాక సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాస నాయుడు, పెయ్యల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు చెందిన వారికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో చదవడం–మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పద్యాలు, నీతి కథలు చదవడం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు లైబ్రేరియన్ మలిపెద్ది చంద్రశేఖర్ రావు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

లావేరులో..

లావేరు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లావేరు గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు గ్లోబ్ ద్వారా ప్రపంచ దేశాలు గురించి తెలియజేశారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సరిహద్దులో వాహనాల తనిఖీ



వాహన పత్రాలను తనిఖీలు చేస్తున్న ఎస్ఐ మహమ్మద్ యాసిన్

పాతపట్నం: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం ఆల్ ఆంధ్ర రోడ్డు కూడలి వద్ద ఎస్ఐ మహమ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనదారులు చాలా మంది నిబంధనలు పాటించడం లేదన్నారు. సరిహద్దు ప్రాంతంలో ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, వాహన పత్రాలన్నీ ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించిన లోడుతో వాహనాలను నడపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సనాతన ధర్మం గొప్పది



ప్రవచనాలు చెబుతున్న రాధామనోహర్‌దాస్ స్వామీజీ

పొందూరు: సనాతన ధర్మంఎన్నో వేళ ఏళ్ల నుంచి ఆచరణలో ఉందని హిందూ ధర్మ ప్రచారకులు రాధామనోహర్ దాస్(తిరుపతి) స్వామీజీ అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని ఆనందాశ్రమంలో స్వామీ శ్రీనివాసానంద ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హిందూ ధార్మిక మహా సమ్మేళనంలో స్వామీజీ పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. ప్రాశ్చాత్య పోకడలు పెచ్చుమీరుతున్న తరుణంలో యువత తప్పుదోవలో నడిచేలా చేస్తున్నాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవ్వకుండా యువత మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఆధ్యాత్మిక ఆనందం సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. తొలుత హోమాలు, యజ్ఞాలు, పూజలు చేశారు. వేలాది మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యువ సేన అఖండ్ భారత ప్రధాన కార్యదర్శి యోగీశ్వర ప్రభుజీ (హైదరాబాద్), సత్యజ్ఞాన ఆశ్రమ పీఠాధిపతి ప్రణవానంద భారతి (తాడేపల్లి), పరవస్తు మఠాధిపతులు వెంకట సత్యనారాయణ ఆచార్యులు (గండేపల్లి), సరస్వతీ జ్ఞానపీఠం ప్రకాశానంద (విజయవాడ), రాష్ట్ర హిందూ సేన అధ్యక్షుడు తురగా శ్రీరాం, భక్తులు పాల్గొన్నారు.

నేడు అవలింగిలో గడపగడపకు మన ప్రభుత్వం

సారవకోట: మండలంలోని అవలింగి సచివాలయం పరిధిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

కార్తీక వనభోజనాల సందడి



జలుమూరు: అల్లాడలో ఉసిరిక చెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: బూర్జ మండల పరిధిలోని వైపర్త గ్రామ నాగావళి తీరంలో ఆదివారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. వేదపండితులు రంపాప్రతాప్ .శర్మ ఆధ్వర్యంలో ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, సత్సంగ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పెద్దలు, చిన్నారులు కలిసి వనభోజనాలు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సరదాగా గడిపారు.

అల్లాడలో..

జలుమూరు: మండలంలోని అల్లాడ, కొమనాపల్లి, శ్రీముఖలింగం, యలమంచిలి, చల్లవానిపేట, పంగపేట తదితర గ్రామాల మామిడి తోటల్లో కార్తీక వనభోజనాలు ఆదివారం నిర్వహించారు. ఉసిరిక చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



సరుబుజ్జిలి: ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

వైద్య శిబిరాలకు విశేష స్పందన



పోలాకి: నరసన్నపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జెమ్స్ వైద్యులు



సారవకోట: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పొందూరు: తోలాపిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 163 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరానికి విజయనగరం మంచు కుమారస్వామి కంటి ఆస్పత్రి వైద్యులు వచ్చి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 78 మందికి శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మోహన్‌గాంధీ, వైద్య సిబ్బంది గురునాథ్, భవానీ పాల్గొన్నారు.

వండర్ కిడ్స్‌లో..

నరసన్నపేట(పోలాకి): అంతర్జాతీయ హ్యూమన్ రైట్స్ దినోత్సవం సందర్భంగా నరసన్నపేట పట్టణంలోని వండర్ కిడ్స్ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. రాగోలు జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యుడు గొలివి మోహన్‌రావు పాల్గొన్నారు. పౌరుల హక్కులను గౌరవించటం వ్యవస్థలు, వాటిని నడుపుతున్న ప్రభుత్వాల బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ జిల్లా, నియోజకవర్గ బాధ్యులు పాల్గొన్నారు.

తోలాపిలో...

పొందూరు: మండలంలోని తోలాపి సత్యసాయి మందిరంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచితం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 450 మందికి గుండె, కీళ్ల నొప్పులు, కంటి, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు దయానంద్, సతీష్, అమృత, మణికంఠ పాల్గొన్నారు.

శంకరుని సాహిత్య వైభవం గొప్పది



పాల్గొన్న ఆధ్యాత్మిక అభిమానులు



ప్రసంగిస్తున్న శ్రీనివాస బంగారయ్యశర్మ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో గుజరాతీపేట రాజరాజేశ్వరీ త్రిపుర సుందరీ దేవీ పీఠం, ఉపనిషన్మందిరం సంయుక్త నిర్వహణలో ఆదిగురువు శంకరాచార్య స్తోత్ర వైభవంపై వక్తలు ఆదివారం ప్రసంగించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ ప్రసంగిస్తూ.. శంకరాచార్యుల సాహిత్య వైభవం ఎంతో గొప్పదన్నారు. శివ, కేశవ అభేదములని వివరించారు. వైరాగ్యం కావాలంటే భజగోవింద, వేదాంత అనుభూతి కోసం అద్వైతాన్ని చదవాలని అన్నారు. ఆదిశంకరులు తిరుపతిలో వేసిన ఆకర్షక యంత్రం వలనే అక్కడకు నిరంతరం భక్తులు వస్తున్నారని చెప్పారు. వేదికపైన మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణ, శివస్తోత్రం పఠన జరిగింది. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, పీఠం నిర్వాకులు పెంట రామచంద్రశేఖరశర్మ, కార్తికేయ శర్మ, కోమలరావు, పులఖండం శ్రీనివాసరావు, ఎస్.నారాయణమూర్తి, భాస్కర భట్ల శ్రీరామశర్మ, పాట్నూరి వెంకటరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర తులసీదళార్చన



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం సహస్ర తులసీదళార్చన పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్‌కుమార్ బృందం ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పద్మావతి శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా అంబలం పూజ

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో అయ్యప్ప అంబలం పూజ ఆదివారం వైభవంగా నిర్వహించారు. సీతంపేట, మెట్టవలస, పాలఖండ్యాం, సంతవురిటి, ఆనందపురం, నిద్దాం, నాగులవలస, మర్రివలస, టి.డి.వలస, జి.సిగడాం, పాగిరితోపాటు మరో 10 సన్నధానాలకు చెందిన అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.